క్లుప్తంగా

రేపు రక్తదాన శిబిరం

వేములవాడరూరల్: వేములవాడ సినారె కళా మందిర్‌లో ఈనెల 22న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు యువ ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు.

తాగునీటి సమస్యకు హెల్ప్‌లైన్ నంబర్

వీర్నపల్లి: వేసవికాలం దృష్ట్యా తాగునీటి సమస్యలు పరిష్కరించడానికి మండల పరిషత్ కార్యాలయంలోని నంబర్ 9676060552కు ఫోన్ చేయాలని మండల అభివృద్ధి అధికారి అబ్దుల్ వాజిద్ గురువారం మండల ప్రజలకు సూచించారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

చందుర్తి: నర్సింగపూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్, ఈవీఎంలపై ఓటింగ్ విధానం, కౌటింగ్‌పై అవగాహన కల్పించారు.

జూనియర్ లెక్చరర్లు విధుల్లోకి..

ముస్తాబాద్: ముస్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముగ్గురు జూనియర్ లెక్చరర్లు విధుల్లో చేరారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. ఇప్పటివరకు గెస్ట్ ఫ్యాకల్టీ లెక్చరర్ల స్థానంలో రెగ్యులర్ లెక్చరర్లు జాయినయ్యారన్నారు. కెమిస్ట్రీ లెక్చరర్‌గా సతీశ్‌కుమార్, ఫిజిక్స్ లెక్చరర్‌గా రజని, హిందీ లెక్చరర్‌గా రాజు విధుల్లో చేరారని అన్నారు.

ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం

బోయినపల్లి: బూర్గుపల్లి గ్రామానికి చెందిన మ్యాన జగదీశ్ తెలంగాణ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫలితాల్లో హాస్టల్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయిన విషయం తెలిసిందే. బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో యువకులు గురువారం ఘనంగా సన్మానించారు. అతికం రాజశేఖర్, ఆంజనేయులు, కొలుపుల కార్తిక్, గణేశ్ తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం

గంభీరావుపేట: ఎస్సీ వర్గీకరణకు ఉభయ సభల్లో ఏకగ్రీవంగా ఆమోదం తెలపడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి, అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

పదేళ్లలో ప్రగతి శూన్యం

వీర్నపల్లి: గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో చేసిన ప్రగతి శూన్యమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాములునాయక్ ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. లెంకల లక్ష్మణ్, తిరుపతియాదవ్, పాటి దినకర్ తదితరులు పాల్గొన్నారు.

రసమయి ఇంటిపై దాడి సరికాదు

తంగళ్లపల్లి: మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి మాజీ చైర్మన్ రసమయి బాలకిషన్‌ను గురువారం మాజీ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాట్ల మధు ఇల్లంతకుంటలో కలిశారు. మధు మాట్లాడుతూ.. బుధవారం కాంగ్రెస్ నాయకులు రసమయి ఇంటిపై దాడి చేయడాన్ని ఖండించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఉన్నారు.

అది బడ్జెట్ కాదు.. అంకెల గారడీ



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

తంగళ్లపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీని తలపించిందని, అది బడ్జెట్ కాదు.. అభివృద్ధికి బారికేడ్ అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. మాజీ ఎంపీపీ పడిగెల మానస, సింగిల్విండో వైస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ కొయ్యడ రమేశ్, మాజీ ఎంపీటీసీ కోడి అంతయ్య, మాజీ సింగిల్విండో చైర్మన్ ఉమ్మారెడ్డి సత్యనారాయణరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అబ్బాడి అనిల్‌రెడ్డి, పడిగెల రాజు, జవహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్‌కు చెందిన లింగాల సత్యనారాయణగౌడ్(42) అనే యువకుడు గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గీత కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇంటి వద్దే ఉంటున్న సత్యనారాయణగౌడ్ ఉదయం తీవ్రమైన గుండె నొప్పికి గురయ్యాడు. ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

డేంజర్ స్పాట్లు..!



జనవరి 1న కొదురుపాక రౌండ్ బోర్డు వద్ద టాటా ఏస్ వాహనం బోల్తా పడగా.. గాయపడ్డ బాధితులు

- ఒకేచోట పలుసార్లు రోడ్డు ప్రమాదాలు
- బోయినపల్లి పెట్రోల్ బంక్ ఏరియాల్లో ఐదుగురి మృతి
- ప్రమాదకరంగా కొదురుపాక, వెంకట్రావుపల్లి రోడ్లు.. ఫోర్‌లేన్ బ్రిడ్జి పరిసరాలు

బోయినపల్లి: ఒకే ప్రాంతంలో వంద నుంచి 200 మీటర్ల దూరంలో ప్రమాదాలు జరగడం ఈ మధ్య కాలంలో ఎక్కువగా జరిగాయి. ఇలాంటి సంఘటనలతో మండలంలోని పలు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఒకే ఏరియాలో పలుసార్లు రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో.. ఆ ప్రాంత పరిసరాలు ప్రమాద హాట్ స్పాట్లుగా మారుతున్నాయి. బోయినపల్లి–వేములవాడ రోడ్డులో స్థానిక కమాన్, పెట్రోల్ బంక్, కేజీబీవీ పరిసరాలు, కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారిలో కొదురుపాక ఫోర్‌లేన్ బ్రిడ్జి, కొదురుపాక రౌండ్ బోర్డు, వెంకట్రావుపల్లి చౌరస్తా తదితర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడడంతో.. ఈ ఏరియాలు డేంజర్ స్పాట్లుగా తయారయ్యాయి. ప్రమాదాల నివారణకు పోలీసులు రక్షణ చర్యలు చేపడుతున్నారు.

బోయినపల్లి రోడ్డులో ఐదుగురు..

బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే బీటీ రోడ్డులో వ్యవసాయ మార్కెట్ కమిటీ కమాన్ నుంచి పెట్రోల్ బంక్, కేజీబీవీ ఏరియాలో పలుసార్లు రోడ్డు ప్రమాదాలు జరిగి ఐదుగురు వ్యక్తులు ఇప్పటి వరకు దుర్మరణం చెందారు. ఈనెల 17న ఈ పరిసరాల్లో ట్రాక్టర్ ఢీకొని బోయినపల్లి గ్రామానికి చెందిన సురకాని మల్లేశం(40) మృతిచెందాడు. 2024 ఫిబ్రవరి 27న కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకంపల్లి అనుబంధ పిట్టలపల్లి గ్రామానికి చెందిన గోదల కమలాకర్(42) టిప్పర్ ఢీకొని అక్కడికక్కడే దుర్మరణంపాలయ్యాడు. వ్యాపారి అయిన కమలాకర్ వేములవాడ వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. గతంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో గుండన్నపల్లి గ్రామానికి చెందిన బ్రహ్మచారి(23) అనే యువకుడు స్పాట్‌లోనే మృతిచెందాడు. కొద్ది సంవత్సరాల క్రితం ఇదే పరిసరాల్లో బోయినపల్లి గ్రామానికి చెందిన వారి బంధువు ఒకరు బైక్ స్కిడ్ కావడంతో పడిపోయి మరణించాడు. మరొకరు సైతం మృతిచెందారని అంటున్నారు. బోయినపల్లి కమాన్ నుంచి కేజీబీవీ పాఠశాల వరకు సుమారు 200 మీటర్ల ఏరియాలో ఈ ప్రమాదాలు జరుగుతుండడంతో హాట్ స్పాట్‌గా మారుతోంది.

కొదురుపాక–వెంకట్రావుపల్లి రోడ్డులో..

కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారిలో కొదురుపాక ఫోర్ లేన్ బ్రిడ్జి నుంచి వెంకట్రావుపల్లి శివారు ప్రాంత పరిసరాల్లో పలుసార్లు రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు మృతిచెందారు. 2024 డిసెంబర్ 26న వెంకట్రావుపల్లి పరిసరాల్లో రోడ్డుపై నిలిపిన లారీని కారు ఢీకొట్టడంతో ముగ్గురు మృతిచెందడం సంచలనం రేపింది. కరీంనగర్ ఎల్ఎండీ మహాత్మానగర్‌కు చెందిన పోలవేని గట్టుబాబు, పోలవేని మంగ, మాడిషెట్టి అశోక్, అహల్య నలుగురు వేములవాడ నుంచి కారులో కరీంనగర్ వస్తుండగా.. రోడ్డుపై నిలిపిన లారీని ఢీకొట్టారు. మంగ మృతిచెందగా.. అనంతరం చికిత్స పొందుతూ గట్టుబాబు, అశోక్ వారం, పది రోజుల వ్యవధిలో మరణించారు. జనవరి 1న కరీంనగర్‌లోని అలుగునూర్ నుంచి వేములవాడ రాజన్న దర్శనానికి టాటా ఏస్ వాహనంలో వెళ్తున్న మహిళా కూలీల వాహనం కొదురుపాక రౌండ్ బోర్డు పరిసరాల్లో అదుపుతప్పి బోల్తా పడింది. ఇందులో మరాఠి కాంత అనే మహిళ మృతిచెందింది. మరో 19 మంది గాయపడ్డారు. కొదురుపాక రౌండ్ బోర్డు ఏరియాలో తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో.. పోలీసులు కొదురుపాక జంక్షన్‌ను బ్లాక్ స్పాట్‌గా గుర్తించారు. కొదురుపాక ఫోర్‌లేన్ బ్రిడ్జి పరిసరాల్లో సైతం తరచూ ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడ్డ సంఘటనలున్నాయి.



వెంకట్రావుపల్లి శివారులో జరిగిన ప్రమాదం

పోలీసుల రక్షణ చర్యలు

తరచూ ప్రమదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి పోలీసులు రక్షణ చర్యలు చేపడుతున్నారు. వాహనదారులు నెమ్మదిగా వెళ్లడానికి కొదురుపాక చౌరస్తా రౌండ్ బోర్డు వద్ద రేడియం స్టిక్కరింగ్‌తో పెట్రోకార్ పోలీస్ బొమ్మను ఏర్పాటు చేశారు. వెంకట్రావుపల్లి చౌరస్తా వద్ద జీబ్రా లైన్స్ వేయించారు. వేగ నిరోధానికి బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు.

వరిలో తెల్ల కంకి.. రైతుల ఆందోళన



ఇల్లంతకుంట: మండలంలోని వివిధ గ్రామాల్లో యాసంగి సీజన్లో వేసిన వరి పంట చేతికొచ్చే దశలో కాండం తొలుచు పురుగు ఆశించి పంటలో కొంత భాగం తెల్ల కంకి(ఊస తిరగడం)గా మారుతోంది. మండలంలో యాసంగి సీజన్లో 20వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. యాసంగిలో వరి పైరును కాండం తొలుచు పురుగు ఆశించడం సాధారణంగా జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి అంటున్నారు. డ్రోన్‌తో మందులు పిచికారీ చేసిన పంటకు ఈ కాండం తొలుచు పురుగు ఆశించడం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని వరి పైర్లకు సోకి.. మరికొన్నింటికి సోకలేదు. కాండం తొలుచు పురుగు పైరును ఆశించడంతో పంట దిగుబడి తగ్గే ప్రమాదముందని రైతులంటున్నారు. ఇల్లంతకుంటకు చెందిన బైరి బాలయ్య అనే రైతు మాట్లాడుతూ.. ఐదెకరాలు వరి సాగు చేశానని, కాండం తొలుచు పురుగు మందులు వరిపై పిచికారీ చేశానన్నారు. అయినా తెల్ల కంకి ఏర్పడుతోందని, పంటలో 10 శాతం వరకు దిగుబడి తగ్గుతుందని వాపోయారు.

పదోతరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

ఇల్లంతకుంట: మండలంలో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి చెప్యాల శ్రీనివాస్‌గౌడ్ గురువారం తెలిపారు. ఇల్లంతకుంట, గాలిపెల్లి హైస్కూల్, కేరళ మోడల్ స్కూల్ సెంటర్లని పేర్కొన్నారు. గాలిపెల్లి సెంటర్లో 123 మంది, ఇల్లంతకుంటలో 124 మంది, కేరళ మోడల్ స్కూల్లో 200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు.

బోయినపల్లి: మండలంలో పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఎంఈవో శ్రవణ్‌కుమార్ తెలిపారు. మండలంలో 10 హైస్కూళ్లు, కేజీబీవీ, గురుకుల, మోడల్ స్కూల్, ఒక ప్రైవేటు హైస్కూల్ ఉంది. బోయినపల్లి, విలాసాగర్ హైస్కూళ్లలో సెంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్ తెలిపారు. 244 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు.



గాలిపెల్లి హైస్కూల్లో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో పదోతరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో నిమ్మ రాజిరెడ్డి తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు ముస్తాబాద్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

ఇల్లంతకుంట: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ముగియగా.. ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారంతో ముగిశాయి. బాలికల గురుకుల కళాశాల, మోడల్ స్కూళ్లతో పాటు ఇల్లంతకుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 503 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని సెంటర్ ఎగ్జామినేషన్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షలు సజావుగా సాగాయని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సునీత తెలిపారు.



పరీక్ష రాసి బయటికొస్తున్న విద్యార్థులు

బస్సు అద్దాలు పగలగొట్టిన విద్యార్థులు

కోనరావుపేట: నిమ్మపల్లి శివారులో ఆర్టీసీ బస్సు అద్దాలను ఇంటర్ విద్యార్థులు పగలగొట్టారు. గురువారం ఇంటర్ పరీక్షలు ముగిసిన తర్వాత ఆర్టీసీ బస్సు విద్యార్థులను మరిమడ్లకు తీసుకెళ్తోంది. అయితే విద్యార్థుల మధ్య గొడవ జరగగా.. కోనరావుపేటకు చెందిన కొందరు విద్యార్థులు నిమ్మపల్లి శివారులో బస్సుపై రాయి విసరడంతో అద్దం పగిలింది. ఆర్టీసీ డ్రైవర్ కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట: బుగ్గరాజేశ్వరతండా శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. బుగ్గరాజేశ్వరతండా శివారులో స్టేషన్ హౌస్ అధికారి శ్రీనివాస్‌రావు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. ఇసుక లోడ్‌తో ట్రాక్టర్ వచ్చింది. అనుమతి పత్రాలు లేకుండానే ఇసుకను రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమాని అజ్మీర మోహన్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేశారు.

ఓటర్ల నమోదుకు సహకరించాలి

సిరిసిల్ల: ఓటర్ల నమోదుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని, ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అని సిరిసిల్ల ఆర్డీవో ఆర్.వి.రాధాబాయి అన్నారు. సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు గురువారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన యువత కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. గజభీంకర్ రాజన్న, శ్రీనివాస్, కోడం రమణ, సంపత్, శేఖర్, అరుకుల రమేశ్, సలీం ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఎండల తీవ్రతపై సాంస్కృతిక కళా ప్రదర్శన

రుద్రంగి: కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని 7వ వార్డు అల్లూరివాడలో తెలంగాణ సాంస్కృతిక సారథి పొత్తూరి రాజు కళాబృందం కళా ప్రదర్శన ఇచ్చారు. ఎండ తీవ్రతపై, తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పాట, మాట ద్వారా వివరిస్తూ కళా ప్రదర్శన ఇచ్చారు. సాంస్కృతిక సారథి వేములవాడ టీం లీడర్ పొత్తూరి రాజు, కళాకారులు గడ్డం దేవయ్య, పూడూరు సంజీవ్, అంతర్పుల ఝాన్సీ, లావణ్య తదితరులున్నారు.

కార్యవర్గం ఎన్నిక

వీర్నపల్లి: బంజెరు గ్రామంలో సీఐటీయూ కార్యదర్శి ఎల్లారెడ్డి, మాజీ అధ్యక్షుడు ఎడపల్లి రాజల్లయ్య ఆధ్వర్యంలో నూతన భవన నిర్మాణ కార్మిక సంఘాన్ని గురువారం ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా పర్లపల్లి చిన్న రాజు, ఉపాధ్యక్షుడిగా పర్లపల్లి మల్లయ్య, కోశాధికారిగా ఆత్మకూరు శంకర్, ప్రధాన కార్యదర్శులుగా తుడుము ఏల్లం, పర్లపల్లి పెద్దరాజు, సభ్యులు ఎన్నికయ్యారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జీతాలు ఇప్పించాలి



ముస్తాబాద్‌లో పంచాయతీ కార్మికుల నిరసన

ముస్తాబాద్: జీతాలిప్పించి తమను ఆదుకోవాలని గురువారం పంచాయతీ కార్మికులు ముస్తాబాద్‌లో నిరసన తెలిపారు. నాలుగు నెలలుగా ఎలాంటి వేతనాల్లేక పని చేస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. నవంబర్ నెల నుంచి వేతనాలు రాకపోవడంతో కార్మికుల కుటుంబాలు దుర్భర జీవితాలను వెళ్లదీస్తున్నాయన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చందుర్తి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. చందుర్తి ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు గురువారం ఆందోళన చేశారు. ఎన్నికల ముందు మధ్యాహ్న భోజన కార్మికులకిచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ మండల విద్యాధికారి వినయ్‌కుమార్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సమర్పించారు.

రూ.4వేలు పింఛన్ ఇవ్వాలి



వినతిపత్రం అందిస్తున్న మహిళలు

బోయినపల్లి: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మహిళా బీడీ కార్మికులకు రూ.4వేలు పింఛన్ వచ్చేలా ప్రభుత్వానికి తెలియజేయాలని విలాసాగర్ గ్రామంలో సీపీఎం మండల కార్యదర్శి గురజాల శ్రీధర్ ఆధ్వర్యంలో మహిళలు కార్యదర్శి శ్రీనివాస్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు.

నెలవారీ కంటి పరీక్షల వివరాలివ్వాలి

బోయినపల్లి: కంటి పరీక్షలకు సంబంధించిన ఏ–స్కాన్, బీ–స్కాన్ వివరాలు ప్రతినెల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి నివేదిక రూపంలో ఇవ్వాలని జిల్లా ఇన్‌చార్జి పీవో ఎంహెచ్ఎన్ డాక్టర్ సంపత్‌కుమార్ అన్నారు. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు స్కానింగ్ సెంటర్ల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కొదురుపాక బుచ్చమ్మ చంద్రమౌళి మెమోరియల్ ట్రస్ట్ కంటి పరీక్షల సొసైటీ ఆసుపత్రిని గురువారం తనిఖీ చేశారు. తనిఖీ బృందం ఆసుపత్రి నిర్వహణ, డాక్టర్ల వివరాలు, స్కానింగ్ సర్టిఫికెట్ తదితర అంశాలు పరిశీలించింది. డిప్యూటీ ఎంవో రాజుకుమార్, హెచ్ఈ బాలయ్య, డీఈవో రమేశ్ తదితరులున్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: మహిళలు మగ్గం వర్క్ రీఫ్రెష్‌మెంట్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నాబార్డు డీడీఎం దిలీప్‌చంద్ర కోరారు. నాబార్డు, స్పందన సేవా సొసైటీ ఆధ్వర్యంలో మగ్గం వర్క్ నేర్చుకున్న మహిళలకు రెండు రోజుల రీఫ్రెష్‌మెంట్ ట్రెయినింగ్‌ను మండల ఐకేపీ కార్యాలయంలో గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. మహిళలు ఈ ట్రెయినింగ్‌తో నైపుణ్యాభివృద్ధి చెందాలని సూచించారు. మగ్గం వర్క్ యూనిట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ట్రైనర్లు భవాని, రేఖ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణానికి భూమిపూజ

చందుర్తి: ఎన్గల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణానికి ప్రధానోపాధ్యాయురాలు సునీతరాణి గురువారం భూమిపూజ చేశారు. సమగ్ర శిక్ష నిధుల నుంచి రూ.13.50లక్షలతో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.



ఎల్లారెడ్డిపేట: గత ప్రభుత్వం చేపట్టిన హరితహారంలో నాటిన మొక్కలు నీరు లేక ఎండిపోతున్నాయి. ఎండలు దంచి కొడుతుండడం.. గ్రామ పంచాయతీ సిబ్బంది నీరు సరిగా పట్టకపోవడంతో పచ్చదనం కరువైంది. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి గ్రామంలోకి వెళ్లే డివైడర్‌లో నాటిన మొక్కలు ఎండిపోయి కళావిహీనంగా మారాయి. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి నిత్యం నీరు పట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

ఘనంగా త్రిశూల యాత్ర



ధర్మగుండంలో త్రిశూల యాత్ర నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ: ఐదు రోజుల నుంచి ఘనంగా జరుగుతున్న శివ కల్యాణోత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మగుండంలో త్రిశూల యాత్ర నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు తీర్థరాజస్వామి పూజ, ఔపాసనం, బలిహరణం, శేషహోమాలు, జయాదులు, పూర్ణాహుతి, యాగ మంటప దేవతోత్వాసనం, నాగబలి, క్షేత్రపాలకబలి, రాత్రి 7.15 గంటలకు ఏకాదశ అవరణములు, ఏకాంత సేవలు నిర్వహించారు. ఐదు రోజుల నుంచి జరుగుతున్న శివ కల్యాణోత్సవాలు ముగిసినట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



ధర్మారంలో క్రికెట్ ఆడుతున్న చల్మెడ

కోనరావుపేట: గ్రామాల్లోని యువత మత్తు, ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. ధర్మారంలో సింగిల్‌విండో డైరెక్టర్ పొట్లపల్లి సత్యనారాయణరావు తల్లిదండ్రుల స్మారకార్థం నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను నాయకులతో కలిసి ప్రారంభించారు. సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, సింగిల్‌విండో చైర్మన్లు బండ నర్సయ్య, సంకినేని రాంమోహన్‌రావు, మాజీ ఎంపీపీ చంద్రయ్య, మాజీ జెడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

ఇల్లంతకుంట: డ్రగ్స్, మత్తు పదార్థాలపై విద్యార్థులు ఆసక్తిని పెంచుకోవద్దని జిల్లా మత్తు పదార్థాల నియంత్రణ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వేదశ్రీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ బత్తిని ఆంజనేయులు పాల్గొన్నారు.

ఒకే దేశం.. ఒకే ఎన్నిక అవసరం

ఎల్లారెడ్డిపేట: ఒకే దేశం.. ఒకే ఎన్నికతో ఎన్నికల వ్యయం తగ్గుతుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడారు. మండలాధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, నాయకులు సందుపట్ల లక్ష్మారెడ్డి, మద్దుల బుగ్గారెడ్డి, కంచర్ల పర్శరాములు, కోనేటి సాయిలు, పూర్ణిమ, ప్రవంతి, సంగీత, నంది నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: ధర్మారంలో బీజేపీ మండలాధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ ఆధ్వర్యంలో ఒకే దేశం.. ఒకే ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా ఇన్‌చార్జి రేగుల మల్లికార్జున్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కోల కిష్టస్వామి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, నాయకులు బైరగోని సురేశ్, ఆసరి దేవరాజ్, సురేశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంతోష్

దాహార్తి తీర్చడం అభినందనీయం



వేములవాడ: మండుతున్న ఎండలకు కోర్టుకొచ్చే కక్షిదారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని వేములవాడ జడ్జి జ్యోతిర్మయి అన్నారు. కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. గుడిసె సదానందం, రజనీకాంత్, భాను, బొడ్డు ప్రశాంత్, నాగుల సత్యనారాయణ, పురుషోత్తం, గుండ రవి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకుబండ్‌పై టనునాయక్ విగ్రహం ఏర్పాటు చేయాలి

సిరిసిల్లటౌన్: రాష్ట్ర రాజధానిలో ట్యాంకుబండ్‌పై టనునాయక్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని లంబాడిల ఐక్యవేదిక రాష్ట్ర ఇన్‌చార్జి నరేశ్‌నాయక్ కోరారు. గురువారం అంబేడ్కర్ చౌరస్తాలో జేఏసీ ఆధ్వర్యంలో కామ్రేడ్ టనునాయక్ వర్ధంతి నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు రాజేశ్‌నాయక్, జిల్లా నాయకులు నరహరినాయక్, తిరుపతి, సాగర్, వెంకటేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: ఉపాధిహామీ కూలీలు పనులను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లబ్ధి పొందాలని ఎంపీడీవో సత్తయ్య కోరారు. రాచర్లగొల్లపల్లి శివారులో చేపట్టిన పనులను గురువారం పరిశీలించారు. కార్యదర్శి రామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రయ్య ఉన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సుజాతను మండలంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ సాబేర బేగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు తదితరులు కలిశారు.

వేములవాడఅర్బన్: వేములవాడ తహసీల్దార్‌గా విజయప్రకాశ్‌రావు గురువారం బాధ్యతలు చేపట్టారు. వేములవాడలో పని చేసిన తహసీల్దార్ మహేశ్‌కుమార్ సిరిసిల్ల తహసీల్దార్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే.

వేములవాడరూరల్: మండల తహసీల్దార్‌గా అబుబాకర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన తహసీల్దార్ సుజాత ఎల్లారెడ్డిపేటకు బదిలీ కాగా.. కలెక్టర్ ఆఫీసర్‌లో విధులు నిర్వహించిన అబుబాకర్ వేములవాడకొచ్చారు.

కోనరావుపేట: మండల తహసీల్దార్‌గా వరలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పని చేసిన విజయప్రకాశ్‌రావు వేములవాడకు బదిలీపై వెళ్లగా.. వేములవాడ ఆర్డీవో కార్యాలయంలో పని చేస్తున్న వరలక్ష్మిని కోనరావుపేట తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వీర్నపల్లి: మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ముక్తార్ పాషా గురువారం బాధ్యతలు స్వీకరించారు. సిరిసిల్ల కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తూ వీర్నపల్లికి బదిలీపై వచ్చారు.